క్లుప్తంగా

'స్పందన'కు ఏడు అర్జీలు

రేపల్లె: స్పందన కార్యక్రమానికి ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీవో జగన్నాథం పార్థసారథి తెలిపారు. స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. రక్షణ శాఖకు సంబంధించి 2, ఆర్టీసీకి 1, తహసీల్దారు కార్యాలయానికి 3 అర్జీలు అందినట్లు చెప్పారు. అర్జీలను ఆయా అధికారులకు అందించి, సమస్యలు త్వరితగతిన పరిష్కరించటం జరుగుతుందని చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కొల్లూరు: పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి, జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి సోమవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని పెసర్లంక శివారు పంట పొలాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఐ రాజ్యలక్ష్మి తన సిబ్బందితో కలసి దాడులు జరిపారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.10,410 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, తెనాలి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడి

చుండూరు(వేమూరు): మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ నవీన్ వివరాల మేరకు.. చుండూరు మండలంలోని దుండిపాలేనికి చెందిన అట్లు చలంరెడ్డి మద్యం సేవించేందుకు వెళ్లగా.. అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి, సురేష్ అనే ఇద్దరు ఆదివారం మద్యం సేవించి వస్తూ.. మద్యం బాటిల్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో చలంరెడ్డి చేతికి తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగ రుణాలకు దరఖాస్తు గడువు పెంపు

రేపల్లె రూరల్: దివ్యాంగులు ఎస్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాల దరఖాస్తు గడువు 15 రోజులు పెంచుతూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. దివ్యాంగులు ఈ నెల 29 లోపు ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు సహాయ సంస్థ సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రేపల్లె పట్టణ, మండలంలోని ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 85922 81310 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్ పట్టాలను ఇప్పించాలని వినతి



తెనాలి: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోరుతూ తగిన డబ్బులు చెల్లించినా, ఇప్పటికీ రిజిస్ట్రేషను దస్తావేజులు లేదా తమ ఒరిజినల్ పట్టాలను ఇవ్వలేదంటూ రూరల్ మండలం కఠెవరంకు చెందిన పలువురు విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ అర్జీలను స్వీకరించారు. కఠెవరంకు చెందిన ఎస్సీ కాలనీవాసులు తమ సమస్యపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 200 మంది వరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నగదు మొత్తం చెల్లించినా, ఇప్పటివరకు ఏ ఒక్కరికీ రిజిస్ట్రేషను చేయించి ఇవ్వలేదని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై విచారించి న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. స్పందన సమావేశంలో మొత్తం ఆరు అర్జీలు వచ్చాయి. విద్యుత్ సమస్యపై ఒకరు, గృహనిర్మాణ అంశంపై మరొకరు అర్జీలను ఇవ్వగా, మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై ముగ్గురు వినతిపత్రాలను అందజేశారు.

మద్యం విక్రయిస్తున్న సేల్స్‌మ్యాన్ అరెస్ట్



తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయించిన ప్రభుత్వ మద్యం దుకాణ సేల్స్‌మ్యాన్, కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం సోమవారం రాత్రి వివరాలు వెల్లడించారు. తెనాలి మండలం పెదరావూరులోని ప్రభుత్వ మద్యం దుకాణానికి నలుగురు యువకులు సోమవారం సాయంత్రం వచ్చారు, దుకాణం నుంచి 185 క్వార్టరు మద్యం సీసాలు కొనుగోలు చేసి తరలించేదుకు టోలోకి ఎక్కించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ చలం, ఎస్‌ఐ ఎం. వినితారెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన దుకాణం వద్దకు వెళ్లారు. మద్యం సీసాలను, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలను కొనుగోలు చేసిన నలుగురు దాసరి ఆనంద్, గుమ్మపు దుర్గాప్రసాద్, కెల్లా పాపారావు, కెల్ల జోగారావులతో పాటు వీరికి మద్యం విక్రయించిన ప్రభుత్వ మద్యం దుకాణ సేల్స్ మ్యాన్ పుట్టా ప్రవీణ్‌లను అరెస్ట్ చేశారు.





స్వాతంత్య్ర ఉత్సవాలకు బాపట్ల ముస్తాబు





బాపట్లటౌన్: బాపట్ల జిల్లా కేంద్రంలో అ'ద్వితీయ'ంగా స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు జరుగనున్నాయి. వారం నుంచి కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలు వీక్షించేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన శకటాలు సిద్ధం చేశారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- జంపని గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



జంపనిలో మహిళకు కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

జంపని(వేమూరు): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని జంపని గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం జాప్యం లేకుండా బిల్లులు చెల్లిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, ఎంపీ'యల్లమాటి మోహన్, సొసైటీ అధ్యక్షుడు గాజుల భానుప్రకాశ్, పార్టీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, పార్టీ గ్రామాధ్యక్షుడు షేక్ బుజ్జి, వైఎస్ ఎంపీపీ షేక్ బాజీ, ఎంపీటీసీ అల్లూరు యోనా, మాజీ ఎంపీటీసీ తాడిబోయిన అంకమ్మరావు, మూల్పూరు రాజేష్, అలపర్తి రవి, గవిని ఉషారాణి, మహ్మద్ అలీఖాన్, నాదెండ్ల సురేష్, శెట్టి సాంబయ్య, బి.తిరుమలరావు, షేక్ మౌలాలీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మంత్రి నాగార్జున పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: ట్రాక్టర్ బోల్తాపడి పడిన ఘటనలో క్షతగాత్రులను రాష్ట్ర మంత్రి డాక్టరు మేరుగ నాగార్జున సోమవారం పరామర్శించారు. చుండూరు మండల కేంద్రంలోని మున్నంగివారి పాలెం గ్రామానికి చెందిన 13 మంది కర్లపాలెం మండలం యాజలిలోని అంకమ్మతల్లి ఆలయానికి ట్రాక్టరులో ఆదివారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చెరుకపల్లి వద్ద కుంచావారిపాలెం ఇంటూరు రహదారిలో ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కన పంట కాల్వలో ట్రాక్టరు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అక్కడ క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యశాల అధికారికి సూచించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే.. మున్నంగివారిపాలెం గ్రామ సర్పంచ్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉండటంతో మృతుల కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించలేకపోయారు. గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు, మరొక వృద్ధుడు ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఎన్నికల అనంతరం బాధిత కుటుంబాలను మంత్రి మేరుగ నాగార్జున పరామర్శించనున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కు అందజేత

భట్టిప్రోలు: రేపల్లెలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలేనికి చెందిన కొమరాబత్తుని నితిన్ కుటుంబ సభ్యులకు మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున సోమవారం వేమూరు క్యాంప్ ఆఫీసులో రూ.5లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీలా నాగరాజు, నీలా రమేష్, నీలా చంటి, నాగరాజు, కనపర్తి శంకర్, బుస్సా రాజారత్నం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు జగదీష్

రేపల్లె రూరల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని 23వ వార్డులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు పట్టణంలోని 1వ వార్డుకు చెందిన కొలుసు రమాదేవి, శ్రీనివాసరావు కుమారుడు కొలుసు జగదీష్(19) స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీయట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అప్పుడప్పుడు చిన్న చిన్న కూలి పనులకు వెళ్తూ.. కుటుంబానికి బాసటగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో 23వ వార్డులో రేకులషెడ్లు వేయటానికి కూలీగా జగదీష్ వెళ్లాడు. నిర్మాణ సమయంలో అతను ఇనుపరాడ్డును తీస్తున్న క్రమంలో అది పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై జగదీష్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు అతనిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అధికం ఏకగ్రీవం.. పోటీ అనివార్యం



ధ్రువీకరణ పత్రాన్ని అందచేస్తున్న రిటర్నింగ్ అధికారి టి.ఉహారాణి



హరిబాబుకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్‌ఓ

మున్నంగివారి పాలెం(వేమూరు): మున్నంగివారి పాలెం సర్పంచ్ ఉప ఎన్నికకు పోటీ నెలకొంది. సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు వచ్చాయి. తిప్పిరెడ్డి మహేష్‌రెడ్డి, అమ్మిశెట్టి శ్రీరామ మూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులిద్దరికీ ఎన్నికల కమిషన్ గుర్తులు ప్రకటించిందని ఎంపీడీవో సుగుణమ్మ సోమవారం తెలిపారు. వరహాపురం గ్రామ పంచాయతీ 10వ వార్డు ఉప ఎన్నికకు వరికూటి కృష్ణకుమారి, పల్లి సుభాషిణి నామినేషన్లు వేశారు. అమర్తలూరు మండలంలో మూల్పూరు గ్రామ పంచాయతీలోని 2వ వార్డుకు పులివర్తి బుజ్జి, మేరకనపల్లి పద్మ, 4 వార్డులో మున్నంగి శాంతకుమారి, మూల్పూరు త్రివేణి, మూల్పూరు ఉషారాణి మధ్య పోటీ నెలకొందని ఎంపీడీవో సుభాని తెలిపారు.

మూడు వార్డుల ఎన్నిక ఏకగ్రీవం

రేపల్లె: మండలంలోని నాలుగు వార్డులకు గాను మూడు వార్డుల ఉప ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో శివపార్వతి సోమవారం తెలిపారు. చాట్రగడ్డ 3వ వార్డుకు నారగాని కుమారస్వామి, 8వ వార్డుకు పడమటి సూర్యనారాయణ, రాజుకాల్వ 5వ వార్డుకు దోమా ఆదినారాయణ ఏకగ్రీవమయ్యారని వెల్లడించారు. బేతపూడి పంచాయతీ 7వ వార్డుకు ఇద్దరు అభ్యర్థులు అమర్తలూరి సుజ్ఞానం, డి.మార్తకుమారి పోటీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

నాలుగు వార్డులు ఏకగ్రీవం

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో నాలుగు వార్డు మెంబర్ల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని కోనేటిపురం పంచాయతీలోని 1వ వార్డు తాత అంకమ్మ, ఐదో వార్డు పడమటి వెంకటేశ్వరరావు, అమర్తలూరు మండలంలోని వానగుంట పాలెం పంచాయతీ 2వ వార్డు బోర్రా ధనలక్ష్మి, చుండూరు మండలంలోని యడ్లపల్లి పంచాయతీలో 8వ వార్డుకు బండారు నరేష్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

కోనేటిపురంలో రెండు వార్డులు ఏకగ్రీవం

భట్టిప్రోలు: కోనేటిపురం పంచాయతీలో 1, 5 వార్డు అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి, ఈవోపీఆర్డీ టి.ఉహారాణి సోమవారం ప్రకటించారు. 1వ వార్డు అన్ రిజర్వుడు స్థానానికి తాతా అంకమ్మ, 5వ వార్డు బీసీ రిజర్వుడు స్థానానికి పడమట వెంకటేశ్వరరావు ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అనురాధ, ఎ.చిన వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

పోతనకట్టవారిపాలెం1వ వార్డు ఏకగ్రీవం

పిట్టలవానిపాలెం: పోతనకట్టవారిపాలెం గ్రామ పంచాయతీ 1వ వార్డు సభ్యునిగా ఒక నామినేషన్ అందినట్లు ఎన్నికల అధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎనుముల హరిబాబు ఒకరే నామినేషన్ అందించినట్లు వెల్లడించారు. దీంతో వార్డు ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని హరిబాబుకు రిటర్నింగ్ అధికారి ఎంఈఓ ఉయ్యూరి వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎనుముల శివపార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎనుముల కోటేశ్వరరావు, కార్యదర్శులు శ్రీనివాసరావు, గోపీకృష్ణ ఉన్నారు.

మూడు వార్డులు ఏకగ్రీవం

చెరుకుపల్లి: తుమ్మలపాలెం 6వ వార్డు, రాంబొట్లపాలెం 1, 10 వార్డు అభ్యర్థుల ఉప ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఆయా గ్రామాల ఆర్వోలు పులిలాజర్, ఎస్కే ఫిరోజ్‌లు తెలిపారు. తుమ్మల పాలెం 6వ వార్డుకు పిట్టురెడ్డి, రాంబొట్లపాలెం 1వ వార్డుకు పేరుబోయిన బలరామిరెడ్డి మాత్రమే నామినేషన్లు దాఖలు కావటంతో వారి ఎన్నికను ఏకగ్రీవం చేశారు. పదో వార్డుకు మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. సర్పంచ్ చీరాల ప్రసాద్‌రెడ్డి చొరవతో అలుమోలు చిరంజీవరెడ్డి, పగడం వీరారెడ్డి ఇద్దరూ తమ నామినేషన్లు ఉప సంహరించుకోటంతో పిట్టు కుమారి ఎన్నిక ఏకగ్రీవమైంది.

జాతీయ జెండాలు అందజేత

భట్టిప్రోలు: ఆజాదీకా అమృత్ దినోత్సవ్‌లో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండాలను పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అందజేశారు.

ప్రజలకు అండగా ఉండేది వైఎస్సార్ సీపీనే

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- కొల్లా వెంకయ్య కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ప్రజలకు అండగా ఉండేది వైఎస్సార్ సీపీనేనని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఇళ్ల పట్టాలు కోసం ఎన్నో ఉద్యమాలు చేసినప్పటికి కొల్లా వెంకయ్య కాలనీ వాసుల గురించి ఎవరూ పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి పట్టాలు ఇచ్చిందని ఆయన తెలిపారు. బాపట్ల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎప్పుడూ ఇవ్వని విధంగా నియోజకవర్గంలో 14వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ప్రతి పేదవాడికి కనీస అవరాలు తీర్చటమే లక్ష్యంగా ముందుకుపోతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం 16 మందికి పట్టాలు ఇచ్చామని, మిగిలిన వారికి కూడా త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ కోకి రాఘవరెడ్డి, తహసీల్దారు చిన్నం సుధారాణి తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

యజమానిపై 6ఏ కేసు నమోదు



గుప్తా ట్రేడర్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చెరుకుపల్లి: ఎరువుల దుకాణాల్లో అక్రమ నిల్వలు ఉంచినా, అధిక ధరలకు విక్రయించినా శాఖాపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరి రావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని గుప్తా ట్రేడర్స్, శ్రీ సత్యన్నారాయణ ట్రేడర్స్‌లో ఏక కాలంలో విజిలెన్స్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. గుప్తా ట్రేడర్స్‌లో రూ.3.3లక్షలు విలువ చేసే ఎరువులను సీజ్ చేసి, యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. అదేవిధంగా శ్రీ సత్యన్నారయణ ట్రేడర్స్‌లోఎరువులకు సంబంధించిన పత్రాలు సక్రమంగా లేకపోవటంతో రూ.2.87 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది ఎస్కే సైదులు, పి.రాజు, గోపిరెడ్డి, బాబు, మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్, ఏఈవో మాధవి పాల్గొన్నారు.

మాజీ సిపాయి ఆట్ల గోపాలరెడ్డి చిరస్మరణీయులు



గోపాలరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధుసూదనరెడ్డి

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): మాజీ సిపాయి ఆట్ల గోపాలరెడ్డి చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి అన్నారు. కర్లపాలెం మండలం ఎంవీరాజుపాలెం గ్రామంలోని మాజీ సిపాయి వైఎస్సార్ సీపీ నాయకుడు స్వర్గీయ ఆట్ల బ్రహ్మానందరెడ్డి తండ్రి గోపాలరెడ్డి సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. దేశ సేవలో తనవంతు సహాయ సహకారం అందించి, ఉద్యోగ విరమణ అనంతరం ప్రజా సేవలో తన భార్య, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు భిక్షావతి, కుమారుడు బ్రహ్మానందరెడ్డి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి గోపాలరెడ్డి అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బన్నారావూరి శ్రీనివాసరావు, అల్లం గోపీకృష్ణం, గిరిజారాణి, డేగల రవిరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో హైవెండ్ విద్యార్థికి కాంస్యం



విద్యార్థితో ఉపాధ్యాయులు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండల కేంద్రంలోని హైవెండ్ హైస్కూల్ విద్యార్థి ఇంద్రసేనారెడ్డి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన హెచ్‌ఎం లక్ష్మీ తిరుపతమ్మ సోమవారం తెలిపారు. పాఠశాలలో ఇంద్రసేనా రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 13న భీమవరంలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో విద్యార్థి కాంస్య పతకం పొందినట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ చాందిని, మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్రబాబు, వ్యాయామోపాధ్యాయులు గోపీచంద్, చైర్మన్ ఉదయచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

రేపల్లె: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9గంటలకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ శాఖ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, పార్టీ నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్ పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

చెరుకుపల్లి: మండలంలోని ఆరుంబాక, కనగాల, కావూరు, పొన్నపల్లి, తూర్పు పాలెం గ్రామాల్లో ఐదు వలంటీర్ పోస్టులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 13మంది ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగా తొమ్మిది మంది హాజరయ్యారన్నారని తెలిపారు. త్వరలోనే ఎంపికైన అభ్యర్థుల జాబిత ప్రకటిస్తామన్నారు. తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ మురళి ఉన్నారు.

కెనాల్ బండ్ పనులు వేగవంతం

తెనాలి: ఆంధ్రాప్యారిస్ ఖ్యాతిని ప్రతిబింబించేలా చేపడుతున్న తెనాలి కెనాల్ బండ్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ టాంక్ బండ్ తరహాలో పట్టణ సరిహద్దుల్లో విజయవాడ రహదారివెంట నిజాంపట్నం కాల్వ అంచున ఏర్పాటుచేసే కెనాల్ బండ్‌పై తెనాలి కీర్తిప్రతిష్టలకు కారకులైన మహనీయుల విగ్రహాలను ప్రతిష్ట చేయనున్నారు. అనంతరం అక్కడ సుందరీకరణతో ప్రజలకు సందర్శనీయ స్థలంగా రూపొందిస్తారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మానసపుత్రిక అయిన కెనాల్ బండ్‌కు ప్రధానమైన విగ్రహ దిమ్మెలు గ్రానైట్ పలకలతో సహా ఏర్పాటు పూర్తయింది. పనుల పురోగతిని సోమవారం ఎమ్మెల్యే శివకుమార్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అవసరమైన సూచనలు చేశారు. తొలి దశలో వివిధ రంగాల ప్రముఖుల విగ్రహాలను 19 ప్రతిష్ట చేయనున్నట్టు తెలిపారు. వీరితో మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావు ఉన్నారు.

బుర్రిపాలెం సర్పంచ్ బరిలో అయిదుగురు

తెనాలిటౌన్: ఈ నెల19న రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామ సర్పంచ్ పదవికి జరుగబోవు ఎన్నికల్లో అయిదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్‌లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం గడువు ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటించి వారికి గుర్తులను కేటాయించారు. సర్పంచ్‌గా చందు శ్రీనివాసరావు, పరుచూరి విజయలక్ష్మి, శాఖమూరి చలపతిరావు, శాఖమూరి రవీంద్రబాబు, శాఖమూరి వేణుగోపాలరావులు పోటీలో ఉన్నారు. వీరికి వరుసగా మంచము, కత్తెర, ఉంగరము, బుట్ట, వంకాయ గుర్తులను కేటాయించినట్లు ఆర్‌ఓ తెలిపారు. హాఫ్‌పేట గ్రామ మూడోవ వార్డుకు జరిగే ఎన్నికలో కోటిపల్లి నరసింహారావు, వల్లూరి శివానందంలు పోటీలో ఉన్నారని వీరికి ప్రెషర్‌కుక్కర్, గౌను గుర్తులను కేటాయించారు. ఈ నెల 19న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక జరుగుతుందని ఆర్‌ఓ వెంకటేశ్వరావు, ఎంపీడీఓ విజయాలక్ష్మణ్‌లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తెనాలిరూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఈ నెల 9వ తేదీన తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డులో సుమారు 65 ఏళ్ల వయసున్న వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని వాకింగ్‌కు వెళ్లిన వారు గుర్తించారు. 108కు సమాచారం ఇచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు : 9440796219, 9440796170 నంబర్లలో సంప్రదించాలన్నారు.